
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జనవరి 2024



నేటి స్పందన కార్యక్రమం రద్దు

పాడేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో లేదా జిల్లాలో ఏదో ఒక మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని పరిపాలనా కారణాల వల్ల ఈ వారం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ వారం ఐటీడీఏలో కాకుండా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా, పలు పరిపాలనా కారణాలతో రద్దు చేశామన్నారు. స్పందనలో దరఖాస్తులు సమర్పించేందుకు శుక్రవారం ఎవరూ పాడేరు ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

పిప్పళ్ల రైతు ఖుషీ



గతంతో పోలిస్తే ఆశాజనకంగా ఈ ఏడాది ధరలు

- మొదటి రకం కిలో రూ.350, రెండో రకం కిలో రూ.50లకు కొనుగోలు
- మన్యం వారపు సంతల్లో జోరుగా క్రయవిక్రయాలు
- ఆనందంలో గిరిజన రైతులు



పాడేరు మండలం గుత్తులపుట్టు సంతలో పిప్పళ్ల క్రయవిక్రయాలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని పిప్పళ్ల రైతులు ఈ ఏడాది ఖుషీగా ఉన్నారు. ఈ ఏడాది పిప్పళ్ల ధరలు ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ లోని వారపు సంతల్లో పిప్పళ్ల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం పెదబయలులో, మంగళవారం జి.మాడుగుల, గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు వారపు సంతల్లో పిప్పళ్ల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

ఔషధ గుణాలున్న పిప్పళ్లను ఏజెన్సీ వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో గిరిజనులు సాగు చేస్తున్నారని ఒక అంచనా. ప్రతి ఏడాది డిసెంబరు ఆఖరి వారం నుంచి పిప్పళ్ల క్రయవిక్రయాలు మొదలై ఏప్రిల్ నెలాఖరుకు వరకు కొనసాగుతాయి. ఏజెన్సీలో హుకుంపేట, జి.మాడుగుల, గుత్తులపుట్టు, పెదబయలు, ముంచంగిపుట్టు వారపు సంతల్లోనే ఎక్కువగా పిప్పళ్ల క్రయవిక్రయాలు జరుగుతాయి. వి.మాడుగులకు చెందిన వర్తకులు గిరిజన రైతులు, గిరిజన వర్తకుల నుంచి వాటిని కొనుగోలు చేస్తారు. పలు రకాల మందుల తయారీకి వినియోగిస్తుండడంతో వీటికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

వి.మాడుగుల నుంచి జాతీయ మార్కెట్‌కు...

మైదాన ప్రాంతమైన వడ్డాది మాడుగుల నుంచి పిప్పళ్ల జాతీయ మార్కెట్‌కు తరలిస్తారు. గిరిజనుల వద్ద కొనుగోలు చేసిన పిప్పళ్లను బాగా శుద్ధి చేసి, చిన్న చిన్న ముక్కలుగా కోసి, ఎటువంటి తేమ లేకుండా ప్యాక్ చేసి కంటైనర్‌లలో ముంబై, పశ్చిమబంగా, చెన్నై ప్రాంతాల్లోని జాతీయ మార్కెట్‌లకు ఎగుమతి చేస్తారు. అక్కడి నుంచి దేశంలో పలు ప్రాంతాలకు, ఇతర దేశాలకు అవి ఎగుమతి అవుతాయని వర్తకులు అంటున్నారు.

ఆశాజనకంగా కొనుగోలు ధరలు

గత మూడేళ్లుగా పిప్పళ్ల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయని గిరిజన రైతులు అంటున్నారు. 2015 నుంచి మూడేళ్ల పాటు పిప్పళ్ల కొనుగోలు ధరలు పతనం కాగా, 2018 నుంచి ధరలు కాస్త బాగున్నాయని, అలాగే గతేడాది కంటే ఈ ఏడాది ధరలు ఆశాజనకంగానే ... మిగతా 8వ పేజీలో

రాజ్‌మాకు గిట్టుబాటు ధర

- ఈ ఏడాది కిలో రూ.85 చొప్పున వారపు సంతల్లో కొనుగోలు



గుత్తులపుట్టులో వర్తకులు కొనుగోలు చేసిన రాజ్‌మా గింజలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో రాజ్‌మాకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభించింది. ప్రస్తుతం కిలో రూ.85 చొప్పున గిరి రైతుల వద్ద వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. శనివారం హుకుంపేట, ముంచంగిపుట్టు, గురువారం గుత్తులపుట్టు వారపు సంతల్లో రైతుల వద్ద కిలో రూ.85 చొప్పున వర్తకులు కొనుగోలు చేశారు. గతంలో కిలో రూ.55 నుంచి రూ.65 మాత్రమే ధర ఉండేది. చైనా దేశం నుంచి మన దేశానికి రాజ్‌మా గింజలు దిగుమతి కాకపోవడంతో ధర పెరిగిందని రైతులు, వర్తకులు అంటున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనులు 25 వేల ఎకరాల్లో రాజ్‌మా పంటను సాగు చేస్తున్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో 10 వేల ఎకరాల్లో, మిగిలిన మండలాల్లో 15 వేల ఎకరాల్లో రాజ్‌మాను పండిస్తున్నారు. గత ఐదేళ్లుగా కిలో రూ.55 నుంచి రూ.65 ధర మాత్రమే ఉండేది. అయినప్పటికీ గిరిజన రైతులకు రాజ్‌మా సాగు గిట్టుబాటు కావడంతో అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. అయితే జాతీయ మార్కెట్‌లోకి ఇతర దేశాల నుంచి రాజ్‌మా దిగుమతి కావడంతో ధర పెరుగుదలలో కొన్నేళ్లుగా పెద్ద తేడా ఉండేది కాదు. గత ఏడాది భారత్- చైనా సరిహద్దు వివాదం నేపథ్యంలో చైనా ఎగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో, రాజ్‌మా గింజల దిగుమతికి బ్రేక్ పడింది. దీని వల్ల దేశీయంగా రాజ్‌మాకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కిలో రూ.85 ధరకు వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా కిలో రూ.80 కంటే ధర తగ్గే అవకాశం లేదని వర్తకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజ్‌మా ధర ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఏజెన్సీలో రాజ్‌మా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో గిరిజన రైతులు తాము సాగు చేసిన పంటలో సగానికిపైగా పంటను నష్టపోయారు.



ముంచంగిపుట్టులో గురువారం ఉదయం 9 గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న మంచు

తగ్గని చలి తీవ్రత

మన్యంలో దట్టంగా కురుస్తున్న మంచు

- చింతపల్లిలో 11, అరకులోయలో 11.7, పాడేరులో 13.8 డిగ్రీలు

పాడేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ గత కొన్ని రోజులుగా చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. చింతపల్లిలో 11, అరకులోయలో 11.7, పాడేరులో 13.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం, ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. దీంతో మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. దీంతో ఏజెన్సీలో రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది.

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరోసారి తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత అధికమైంది. గురువారం చింతపల్లిలో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చలితోపాటు మంచు దట్టంగా కురుస్తున్నది. గిరిజన గ్రామాల్లో ఉదయం పదిన్నర గంటల వరకు మంచు దుప్పటి వీడడం లేదు. చలి అధికంగా ఉండడంతో ఈ ప్రాంతవాసులు అధిక సమయం ఉన్ని దుస్తులు ధరించి కనిపిస్తున్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గురువారం ఉదయం పది గంటల వరకు మంచుతెరలు వీడలేదు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అనే తేడా లేకుండా చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వణికిపోతున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువైయిందని స్థానికులు అంటున్నారు.



చింతపల్లి మండలం మడిగుంటలో కురుస్తున్న మంచు

నేడు విశాఖలో నారా భువనేశ్వరి పర్యటన

- చంద్రబాబునాయుడు అరెస్టయినప్పుడు మనోవేదనతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- ఆర్థిక సాయం పంపిణీ



విశాఖ నోవాటెల్‌లో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి శుక్ర వారం నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు నాయుడిని ప్రభుత్వం అకారణంగా అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తున్న భువనేశ్వరి గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నోవాటెల్ హోటల్ నుంచి బయలుదేరి తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 31వ వార్డులో గల వెంకటేశ్వర మెట్ట ప్రాంతంలో మృతిచెందిన ఎ.చిన్నా కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. ఆ తరువాత 10.30 గంటలకు జ్ఞానాపురంలో ఎం.రమణ ఇంటికి వెళ్లి అతని కుటుంబాన్ని కలుసుకుంటారన్నారు. అక్కడ నుంచి బయలు దేరి 10.55 గంటలకు విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్లపాలెంలో పి.కనకారావు కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అనంతరం 11.35 గంటలకు గాజువాక నియోజకవర్గ పరిధిలోని 65వ వార్డులో కె.వెంకటరావు, ఉప్పలపాటి సరోజిని, శ్రీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణ (తెలుగుదేశం బాబాయ్)ల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్ బయలుదేరి వెళతారన్నారు. విలేకరుల సమావేశంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

- చంద్రబాబు సమక్షంలో చేరిన పాడేరు నియోజకవర్గ వైసీపీ సర్పంచులు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పాడేరు నియోజకవర్గ వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు

అమరావతి, జనవరి 4: పాడేరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నేతలు గురువారం చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. బెన్నవరం సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ, దేవరపల్లి సర్పంచ్ సిరబాల బుజ్జిబాబు, ఉప సర్పంచ్ గుమ్మడి రాజుబాబు, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, తుంపాడ సర్పంచ్ తమర్భ సూర్యకాంతం, అన్నవరం ఎంపీటీసీ కిల్లో కృష్ణా, రింతాడ సీపీఐ మాజీ ఎంపీటీసీ సెగ్గ సంజీవ్‌రావు, వంతాడపల్లి మాజీ సర్పంచ్ బాకూరు బాలరాజ్, మాజీ సర్పంచులు సాగిన బుంజు పడాల్, మజ్జి భీమేష్, ముట్టడం పెద్దబాబాయ్, పాడేరు రైతు సంఘం అధ్యక్షుడు ముట్టడం సరబన్న పడాల్, ప్రభుత్వ మాజీ ఉద్యోగి కిల్లు వెంకటరమేష్ నాయుడుతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిని చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని, సర్పంచులను ఉత్సవ విగ్రహంలా ప్రభుత్వం మార్చిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు మళ్లీ మహర్దశ రావాలంటే టీడీపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో పాడేరులో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని వారికి చంద్రబాబు సూచించారు.

వైసీపీలో స్థానిక రగడ

ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించడంపై కొనసాగుతున్న నిరసనలు

- స్థానికులకే టికెట్ కేటాయించాలని పార్టీ నాయకుల ఆందోళనలు

అరకులోయ, జనవరి 4:

వైసీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ మాధవిని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు గురువారం కూడా కొనసాగాయి. అరకులోయ, హుకుంపేట, డుంబ్రిగుడ తదితర మండలాల్లో ఆ పార్టీ నాయకులు ఆందోళనలు చేసి మాధవి వద్దు.. స్థానికులే ముద్దు అంటూ నినాదాలు చేశారు.



హుకుంపేటలో ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

అరకులోయలో ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట స్థానిక వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధిష్ఠానం స్థానిక నాయకులు, కార్యకర్తల మనోభావా లను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ పరిధిలో ఏ సామాజిక వర్గానికి చెందిన వారికైనా టికెట్ కేటాయిస్తే వారి విజయానికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమర్డి రఘునాథ్, ఎస్.భాస్కరరావు, డుంబ్రిగుడ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణారావు, డుంబ్రిగుడ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రాందాసు, కించుమండ మాజీ సర్పంచ్ అప్పలరాజు, అరకులోయ మండల నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: స్థానిక వైసీపీ నాయకులు హుకుంపేటలో గురువారం ఆందోళన చేశారు. స్థానికేతరులు వద్దు.. స్థానికులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గానికి చెందిన ఎవరికి టికెట్ కేటాయించినా వారి గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కొర్రా కాసులమ్మ, మాజీ వైస్ ఎంపీపీ రవిప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



అరకులోయ ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ మాధవిని నియమించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, పార్టీ అధిష్ఠానం పునరాలోచించకుంటే తమ పదవులకు రాజీనామాలు చేస్తామని ఆ పార్టీ నాయకులు సింహాచలం, కృష్ణారావు, మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఆనందరావు హెచ్చరించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో చాలా మంది ఎమ్మెల్యే టికెట్‌కు ప్రయత్నాలు చేస్తున్నారని, అటువంటి వారికి కేటాయించకుండా వేరే నియోజకవర్గం నుంచి ఇక్కడ కేటాయించడం సరికాదన్నారు. ఈ విధమైన చర్యల వల్ల భవిష్యత్తులో పార్టీ నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: స్థానికులకే అరకు అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని పెదబయలు మండల కేంద్రంలో వైసీపీ నాయకులు ఆందోళన చేశారు. గురువారం కార్యకర్తలతో కలిసి వారు స్థానికేతరులు వద్దు.. స్థానికులే ముద్దు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరయ్య, సూర్యనారాయణ, రాజుబాబు, సింహాచలం, కనకరాజు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

20 మంది సీఐల బదిలీలు

- ఎన్నికల నేపథ్యంలో ఒకేచోట మూడేళ్లకు పైబడి
- పనిచేస్తున్న వారికి స్థానచలనం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖ రేంజ్‌లో 20 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలకు స్థానచలనం కల్పించారు. ఇంకా సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా ... మిగతా 8వ పేజీలో

అంగన్‌వాడీల వినూత్న నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 24వ రోజు చేరింది. జిల్లాలో పలు చోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షా శిబిరం వద్ద నిరసన చేపడుతున్నారు. కాగా గురువారం డుంబ్రిగుడ జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు కబడ్డీ ఆడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

- వార్త 8వ పేజీలో..



డుంబ్రిగుడలో కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అమర్‌నాథ్ కంటతడి

- అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో భావోద్వేగానికి గురైన మంత్రి
- ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి వేరొకరిని సమన్వయకర్తగా నియమించిన వైసీపీ అధిష్ఠానం



సమావేశంలో కంటతడి పెట్టిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 4: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..ప్రస్తుతం ఆయన అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం వైసీపీ అధిష్ఠానం అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించింది. అమర్‌నాథ్‌కు ఇంకా ఏ నియోజకవర్గం కేటాయించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఉద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనకాపల్లి ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని, ఆప్యాయతను మరిచిపోలేక బాధను దిగమింగుకుంటున్నానన్నారు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే, అనకాపల్లి ప్రజలు రాజకీయ పునర్జన్మను ఇచ్చారన్నారు. గుడివాడ కుటుంబం పేరు చిరస్థాయిగా గుర్తుండిపోయే విధంగా అనకాపల్లి ప్రజలు తనను ఆదరించారన్నారు. తనను మాదిరిగా వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి పార్టీ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్‌కుమార్‌ను కూడా ఈ ప్రాంత ప్రజలు ఆదరించాలని మంత్రి కోరారు. తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగిస్తే దానిని నిర్వహిస్తానన్నారు. ఆయన ఆదేశాల మేరకు తాను పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా, అమర్‌నాథ్ ఎలమంచిలి, చోడవరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్‌నాథ్ భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి. ఆయన్ను అనకాపల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేయించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఫ్లైయాష్ లారీల అడ్డగింత

ధూళి ఎగుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని పైడివాడఅగ్రహారం ప్రజలు ఆవేదన

- భారీ వాహనాల వల్ల రహదారి ధ్వంసమైందని ఆగ్రహం
- సుమారు గంట సేపు రోడ్డుపై బైఠాయింపు
- పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ



పైడివాడఅగ్రహారం వద్ద ఫ్లైయాష్ లారీలను అడ్డుకున్న గ్రామస్థులు



అనకపల్లి- లంకెలపాలెం రోడ్డుపై ముద్దలుగా పడి ఉన్న ఫ్లైయాష్

సబ్బవరం, జనవరి 4: మండలంలోని లంకెలపాలెం రోడ్డులో ఫ్లైయాష్ రవాణా చేస్తున్న లారీలను పైడివాడఅగ్రహారం ప్రజలు గురువారం అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. పలు మార్లు స్థానిక అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ సుమారు రెండేళ్లుగా అనకపల్లి-లంకెలపాలెం రోడ్డులో పరవాడ ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. అయితే పరిమితికి మించిన లోడుతో పాటు అధిక వేగంగా లారీలు, డంపర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని చెప్పారు. దీనికి తోడు ఫ్లైయాష్ తరలించే లారీలు టార్పాలిన్లు కప్పకపోవడంతో ముద్దలు ముద్దలుగా ఫ్లైయాష్ రోడ్డుపై పడుతోందని తెలిపారు. దీని వల్ల ఫ్లైయాష్ ధూళి ఎగసి అనకపల్లి, ఎరుకు నాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నెల రోజులు క్రితం ఇలాగే వాహనాలను అడ్డుకుంటే రోడ్డుపై నీళ్లు జల్లుతున్నారని, అయినా ఫలితం లేదన్నారు. రోడ్డుపై జారిపడ్డ ఫ్లైయాష్‌పై నీరు చల్లడం వల్ల రోడ్డంతా బురదగా మారి ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పైడివాడఅగ్రహారం వాసులు సుమారు గంట సేపు వాహనాలను అడ్డుకోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి వాహనాల రాకపోకలకు క్రమబద్ధీకరించారు.

హామీలు విస్మరించడం సీఎంకు తగదు

- ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ

అనకాపల్లి రూరల్, జనవరి 4: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోవడం సీఎం జగన్మోహన్‌రెడ్డికి తగదని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరింది. కొండకొప్పాకలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం రెండు వారాల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పైగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామంటూ నోటీసులు జారీ చేసి బెదిరింపులకు దిగడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. విద్యా శాఖ ఉన్నతాధికారులతో కుమ్మక్కై కేజీబీవీ ఉద్యోగుల బెదిరింపులకు కారణమైన కేజీబీవీ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకురాలు ఎస్.దేవిని యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఆర్.వరలక్ష్మి, కార్యదర్శిగా పద్మావతి ఎన్నికయ్యారు.

ఘనంగా శ్రీవారి తిరువీధి సేవ



మాఢవీధుల్లో ఊరేగుతున్న ఉపమాక వెంకన్న (ఇన్‌సెట్‌లో) స్వామివారు

నక్కపల్లి, జనవరి 4: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం కన్నుల పండువగా స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉభయదేవేరులతో కూడిన స్వామిని రాజాధిరాజ వాహనంపై, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టోడమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 4: పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు శుక్రవారం నుంచి ప్రత్యేక తేదీల్లో అదనంగా ఒక విస్టోడమ్ కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు ఈనెల 5, 6, 7, 12, 14, 19, 20, 21, 26, 27, 28 తేదీల్లో...కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు ఈనెల 6, 7, 8, 13, 15, 20, 21, 22, 27, 29 తేదీల్లో అదనపు విస్టోడమ్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

యువత ఉపాధి కోసం సీఐపీఈటీతో సింహాద్రి ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు

పరవాడ, జనవరి 4: నిర్వాసిత గ్రామాల్లో గల యువతకు ఉపాధి కల్పించేందుకు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీస్ (సీఐపీఈటీ) సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. మేషన్ ఆపరేటర్ - ఇంజంక్షన్ మెయిలింగ్, మిషన్ ఆపరేటర్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌పై యువతకు ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. రెండు బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు 30 మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు గురువారం సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్. శేఖర్‌తో సింహాద్రి జీజీఎం, ఇతర అధికారులు కలిసి ఒప్పందం కుదుర్చుకుని సంతకాలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కూడా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్‌ఆర్ హెడ్ బీబీ పాత్ర, సీఎస్‌ఆర్ విభాగం ప్రతినిధులు కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, సీఐపీఈటీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నాశనం

- బీసీలను దగా చేస్తున్న సీఎం జగన్
- ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరామమూర్తి విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

చోడవరం, జనవరి 4: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి విమర్శించారు. గురువారం పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, కానీ కార్యాలయాల నిర్వహణకు కూడా నిధులు ఇవ్వకుండా బీసీలను వంచించిందని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీసీ అధికారులను కూడా ఈ ప్రభుత్వం దగా చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన పోస్టుల్లో సీఎం జగన్ తన సామాజికవర్గం వారి నియమించకుంటున్నారని, బీసీ అధికారులను ప్రాధాన్యం లేని పోస్టులకు పరిమితం చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలపై ఈనెల 7న విశాఖలో నిర్వహిస్తున్న బీసీ గర్జన సభలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి, కొప్పాక భాస్కరరావు, వెంకటరావు, నారాయణరావు, దట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రుషీల్ డెకార్ పరిశ్రమలో ప్రమాదం

- ఎలక్ట్రికల్ ఇంజనీర్ మృతి



మనీష్ మృతదేహం

అచ్యుతాపురం/రాంబిల్లి, జనవరి 4: సెజ్‌లోని రుషీల్ డెకార్స్ కర్మాగారంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ మృతి చెందారు. మధ్య ప్రదేశ్‌కి చెందిన మనీష్(30) ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడ. గురువారం తెల్లవారుజాము మూడున్నర గంటల ప్రాంతంలో విధి నిర్వహణలో ఉండగా కన్వేయర్ బెల్టులో ఆయన చెయ్యి ఉండిపోయింది. బెల్టుతో పాటు మనీష్ కూడా రోలర్ కిందకు వెళ్లిపోయారు. కుడిచేయి పూర్తిగా నలిగిపోవడంతో పాటు తీవ్రగాయాలపాలై ఆయన మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. కాగా కర్మాగారాల్లో సరైన భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము ఆరోపించారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారంతో పాటు సమగ్ర విచారణ జరిపి కర్మాగారం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఎలమంచిలి, జనవరి 4: మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో ఇంటి వద్ద పార్కింగ్ చేసిన తన బైక్ చోరీకి గురైనట్టు బాధితుడు ఎన్.విజయ్‌కుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి రూరల్ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తిపై ఫిర్యాదు

ఎలమంచిలి, జనవరి 4: మునిసిపాలిటీలోని కొత్తపాలేనికి చెందిన ఓ మహిళను గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి రూరల్ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. దీనికి సంబంధించి రూరల్ ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపాలేనికి చెందిన లక్ష్మిని సోమలింగపాలేనికి చెందిన ఎ.జగన్నాథరావు గురువారం బైక్‌పై తీసుకువెళుతుండగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆమెను అతను చేతితో గుద్దడంతో అదుపుతప్పి వాహనం పైనుంచి పడి గాయాలపాలైంది. ఈ మేరకు ఆమె కుమారుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోడవరం బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

చోడవరం, జనవరి 4: పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల మందు పార్టీ వ్యవహారంలో వార్డెన్ బి.చిన్నయ్యను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి బీసీ హాస్టల్‌కు చెందిన కొంతమంది విద్యార్థులు, పక్కనే నిర్మాణంలో వున్న ఒక భవనంలో బీరు, బిర్యానీలతో పార్టీ చేసుకున్న ఘటన సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించడంతోపాటు, సమగ్ర దర్యాప్తు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు ఆదేశించారు. దీంతో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు పూర్తి వివరాలు సేకరించారు. వీరు ఇచ్చిన నివేదికల ఆధారంగా హాస్టల్ వార్డెన్ చిన్నయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, వారి పిల్లల పరిస్థితి గురించి వివరించినట్టు తెలిసింది.

ఇద్దరు కేజీబీవీ ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు

అనకాపల్లి రూరల్, జనవరి 4: జిల్లాలో ఇద్దరు కేజీబీవీ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ డీఈవో కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అచ్యుతాపురం మండలంలోని కేజీబీవీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పి.జయంతి, పీఈటీ దేవరపు దేవిరాణి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొంటున్నారు. దీనిపై వివరణ కోరతూ డీఈవో కార్యాలయం నుంచి ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని అధికారులు.. విధుల నుంచి తొలగిస్తూ టెర్మినేషన్ ఉత్తర్వులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

» గిరిజనులకు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచన



హుకుంపేటలో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో అభిషేక్

హుకుంపేట, జనవరి 4 : గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగా ప్రవేశపెట్టిన పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలంలోని పాతకోట సచివాలయం పరిధిలో గురువారం ఏర్పాటైన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీటీజీల్లో అర్హులైన వారికి గృహాల మంజూరుతో పాటు పదకొండు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని ఆదివాసీ గిరిజనులు ప్రత్యేకంగా సంబంధిత సచివాలయాల్లో వీఆర్‌లను సంప్రదించి అన్ని అర్హతలతో ఈ పథకాలను పొందాల్సిందిగా సూచించారు. నూతనంగా 948 మందికి గృహాలు మంజూరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ గౌరీశంకర్, ఇంజనీరింగ్ అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భల్లుగుడ గ్రామంలో సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఏఈఈ కాంతి

అరకులోయ : కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన తెగలో వెనుకబడిన పీవీటీజీలకు హౌసింగ్ స్కీంను అమలు చేస్తుందని గృహ నిర్మాణ శాఖ ఏఈఈ కాంతి తెలిపారు. ఇళ్లు లేని పీవీటీజీ గిరి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పాతభల్లుగుడ గ్రామంలో గురువారం సర్వే నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. పీఎం జన్మన్ పథకం కింద ప్రతి పీవీటీజీ లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.2.3 లక్షలు మంజూరు కానుందన్నారు. ఇందులో భాగంగా మండలానికి 1592 గృహాలు మంజూరైనట్టు చెప్పారు. శుక్రవారంతో లబ్ధిదారుల ఎంపిక పూర్తవుతుందని, ఇంకా అర్హులుంటే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

» టీడీపీ శ్రేణుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జనవరి 4 : నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు వేగవంతం చేయాలని ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. కుమ్మరిపుట్టులోని ఆమె నివాస గృహంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంయుక్తంగా తయారు చేసిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీయేనన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వైసీపీ ప్రభుత్వం అక్రమాలు, అవినీతిపై పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పాడేరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేసే విధంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. అనంతరం జగన్ పాలనలో వైఫల్యాలను భాగ్యలక్ష్మి ఎండగట్టారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, ఎస్టీ సెల్ కార్యదర్శి గబ్బాడ సింహాచలం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నాయకులు వంతాల కొండలరావు, నరసింగ శ్రీనివాసరావు, పిన్నయ్యదొర, భీంబాబు, రాము, భీమన్న, పాండురాజు పాల్గొన్నారు.

'పంచాయతీ నిధుల దారిమళ్లింపు తగదు'

ముంచంగిపుట్టు, జనవరి 4 : పంచాయతీల అభివృద్ధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడం అన్యాయమని దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగ స్వామి అన్నారు. దారెల గ్రామంలో గురువారం జరిగిన గ్రామ సభలో పలు సమస్యలపై చర్చించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనుల కోసం వినియోగించడం దారుణమన్నారు. ఈ కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పంచాయతీ పరిధిలో ఏ గ్రామాన్ని సందర్శించినా సమస్యలు దర్శనమిస్తున్నాయని, ఎటువంటి నిధులు లేకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు కేటాయించిన నిధులను పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిప్పళ్లు రైతు ఖుషీ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయని వర్తకులు, రైతులు అంటున్నారు. ఔషధ గుణాలున్న పిప్పళ్లు రెండు రకాలుగా ఉంటాయి. ఎక్కువ లావుగా ఉన్నది మొదటి(ముడి)రకం, తీగలా ఉండేది రెండో (నలక) రకంగా విభజిస్తారు. గత ఏడాది మొదటి రకం కిలో రూ.320, రెండో రకం రూ.30 ధర ఉండేది. ఈ ఏడాది ధర పెరిగింది. దీంతో మొదటి రకం కిలో రూ.350, రెండో రకం కిలో రూ.50 చొప్పున వారపు సంతల్లో వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు వారపు సంతను సందర్శించిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పిప్పళ్ల కొనుగోలు ధరలపై పలువురు గిరిజన రైతులు, వర్తకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగానే ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్‌లో ధరలకు అనుగుణంగానే స్థానిక సంతల్లో వీటి ధరలను నిర్ణయిస్తారని వర్తకులు తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు, వర్తకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 మంది సీఐల బదిలీలు

... 5వ పేజీ తరువాయి

పరిగణనలోకి తీసుకున్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూ రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు రొక్కం రవిప్రసాద్, జి.రాంబాబు, సీహెచ్ శ్రీధర్‌లను విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే జి.దేముళ్లను శ్రీకాకుళం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, వై.మురళీరావును విజయనగరం జిల్లా ఎస్.కోట యూపీఎస్‌కు, సీహెచ్ షణ్ముఖరావును ఎస్.కోట సర్కిల్‌కు, ఎన్‌వీ ప్రభాకరరావును గజపతినగరం సర్కిల్‌కు నియమించారు. అలాగే పి.రమణను అనకాపల్లి జిల్లా సబ్బవరం, బీసీహెచ్ స్వామినాయుడిని కె.కోటపాడు, నల్లి సాయిని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సీఐలుగా నియమించారు. విశాఖ సిటీలో పనిచేస్తున్న సీహెచ్ సూరినాయుడిని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, ఎం.అవతారాన్ని శ్రీకాకుళం ట్రాఫిక్‌కు, టి.ఇమ్మాన్యుయల్ రాజును శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం ట్రాఫిక్‌లో పనిచేస్తున్న టి.కామేశ్వరరావు, ఎస్.కోట సీఐ ఎస్.బాలసూర్యారావు, అనకాపల్లి జిల్లా కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, సబ్బవరం సీఐ పి.రంగనాథంలను విశాఖ రేంజ్‌కు సరండర్ చేశారు. గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడిని అనకాపల్లి జిల్లా కొత్తకోట, పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబును కశింకోట సీఐలుగా, అనకాపల్లి జిల్లాలో ఉన్న కె.కుమార్‌స్వామిని అక్కడే సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఏ ప్రభుత్వం ఇంత మొండిగా లేదు

» గతంలో ఎన్నో ఆందోళనలు చేశాం » ఎప్పుడూ ఇలా చూడలేదు » బెదిరింపులకు గురిచేయడం మాని హామీలు అమలు చేయండి

» ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అంగన్‌వాడీలు స్పష్టీకరణ » డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని వెల్లడి



పాడేరులోని ఆందోళన శిబిరం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



డిమాండ్లు పరిష్కరించాలంటూ చింతపల్లిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

పాడేరు రూరల్, జనవరి 4 : డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలను బెదిరింపులకు గురిచేయడం మాని, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కృషి చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఇక్కడ చేపడుతున్న ఆందోళన గురువారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మితో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎన్నో ప్రభుత్వాలతో పోరాటాలు చేశామని, ధర్నాలు చేపట్టామని, కానీ ఇంత మొండిగా ఏ ప్రభుత్వాలు వ్యవహరించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరుమార్చుకోకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా, మండల నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చింతపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పెంటమ్మ వాపోయారు. ఇక్కడి ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటైన దీక్షా శిబిరంలో గురువారం ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు రాములమ్మ, అక్కమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం డుంబ్రిగుడలోని జాతీయ రహదారిలో కబడ్డీ ఆడుతూ వినూత్న రీతిలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. డిమాడ్లు పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ, కార్యదర్శి సత్యవతి, నాయకులు పవిత్ర, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలపై స్పందించండి

» గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్



ఆందోళనకారులకు మద్దతు తెలుపుతున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

పాడేరు రూరల్, జనవరి 4 : సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయపల్లి సంహాచలం డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు సదరు సిబ్బంది ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా చేపట్టిన దీక్షా శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలపై పోరాడుతున్న సిబ్బంది పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించి బెదింపులకు గురిచేయడం తగదన్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కేశవరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గంగరాజు, జిల్లా కన్వీనర్ రామారావుదొర, పాడేరు జోన్ కన్వీనర్ జె.సూర్యనారాయణ, జీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె.కిశోర్, మాధవ్, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.కేశవరావు తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.



కొల్లాపుట్టు సచివాలయ భవనానికి తాళాలు వేసి ఉన్న దృశ్యం

కొల్లాపుట్టు సచివాలయ భవనానికి తాళాలు

» నాలుగున్నర ఏళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని ఆగ్రహం

డుంబ్రిగుడ, జనవరి 4: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ సచివాలయానికి సొంత భవనం లేక ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సచివాలయం ప్రారంభం నుంచి ఇప్పటికీ సుమారు నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో ఆ ఇంటి యజమాని గురువారం సచివాలయానికి తాళాలు వేసేశారు. దీంతో సచివాలయ సిబ్బంది గురువారం విధులు నిర్వహించడానికి వెళ్లి తాళాలు వేసి ఉండడంతో బయట వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



వృద్ధురాలికి పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి, జనవరి 4 : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఇక్కడ మండల పరిషత్ కార్యాలయంలో వృద్ధులకు రూ.మూడు వేల పింఛన్ పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

హుకుంపేట : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ మత్స్యలింగం గురువారం పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ అశోక్, సర్పంచ్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

'అబ్రహాంకు సముచిత స్థానం కల్పించాలి'



సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు

అరకులోయ, జనవరి4 : టీడీపీ నాయకుడు సివేరి అబ్రహాంకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని పార్టీ అనంతగిరి మండల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం చిలకలగెడ్డలో టీడీపీ మండల శాఖ అధ్య, కార్యదర్శులు బుజ్జిబాబు, ఆనందరావుల ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సోమ సేవలను పార్టీ అధిష్ఠాం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కొట్యాడ అప్పారావు, మాజీ ఎంపీటీసీ దయానిధి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే ఏజెన్సీలో శిశు మరణాలు

» టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర ఆవేదన » గనికిలో మృతిచెందిన బాలిక కుటుంబానికి పరామర్శ



మరణించిన శిశువు కుటుంబాన్ని పరామర్శిస్తున్న దొన్నుదొర

హుకుంపేట జనవరి 4 : ప్రభుత్వ వైఫల్యాల వల్లే ఏజెన్సీలో శిశుమరణాలు అధికంగా సంభవిస్తున్నాయని టీడీపీ అరకు ఇన్ చార్జి సివేరి దొన్నుదొర వాపోయారు. మండలంలోని జర్రాకొండ పంచాయతీ గనికి గ్రామంలో గురువారం పర్యటించారు.సకాలంలో వైద్యం అందక మృతిచెందిన పసికందు తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ చిన్నారి తల్లిదండ్రులు బొంజుబాబు, రమణమ్మ దంపతులు మాట్లాడుతూ తమ మూడు నెలల కుమార్తె నాలుగు రోజులు నుంచి వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడేదని తెలిపారు. దీంతో నాటు వైద్యుడు పరీక్షించినా తగ్గలేదని, పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామును మృతిచెందిందని కన్నీరుమున్నీరుగా విలపించారు. దొన్నుదొర వారిని ఓదార్చారు. ప్రభుత్వం సరైన వైద్య సేవలు అందించకపోవడం వల్లే గ్రామాల్లో శిశుమరణాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. శిశు సంరక్షణ శాఖ సిబ్బంది పిల్లలు జన్మించిన తరువాత పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏజెన్సీలో శిశుమరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు తులసీరావు, శంకర్, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సామాజికవర్గాన్ని

విస్మరించడం వైసీపీకి తగదు

» పునరాలోచించకుంటే మూకుమ్మడి రాజీనామాలు

» పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణరావు హెచ్చరిక

చింతపల్లి, జనవరి 4 : పాడేరు, అరకువేలి నియోజకవర్గాల్లోని ప్రధాన సామాజికవర్గాల్లో ఒకటైన వాల్మీకిని వైసీపీ అధిష్ఠానం విస్మరించడం తగదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు వాపోయారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే, అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల కేటాయింపులో కొన్నేళ్లుగా వివిధ పార్టీలు భగత, వాల్మీకి, కొండదొర సామాజికవర్గాలకు సమప్రాధాన్యం ఇస్తూ వస్తున్నాయన్నారు. ప్రస్తుతం వైసీపీ అధిష్ఠానం సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఒకే సామాజికవర్గం నుంచి అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా భాగ్యలక్ష్మికి, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా విశ్వేశ్వరరాజును నియమించిందన్నారు. వాల్మీకి సామాజికవర్గంలో సీనియర్ నేత, మాజీ మంత్రి పసులేటి బాలరాజును వైసీపీ అధిష్ఠానం కనీసం పరిగణలోకి తీసుకోకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో వాల్మీకి, పీవీటీసీ సామాజికవర్గాలకు సమన్యాయం చేయాలని, లేనిపక్షంలో పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు రీమల మౌళి, సాయి పాల్గొన్నారు.

కాఫీ గింజలను దళారీలకు విక్రయించి మోసపోవద్దు

» జీసీసీ ద్వారా చెర్రీ, పార్చిమెంట్‌కు అంతర్జాతీయ ధరలు : డీఎం దేవరాజు



పెద్దూరులో కాఫీ గింజల తేమ శాతం పరిశీలిస్తున్న డీఎం

చింతపల్లి, జనవరి 4 : ఆదివాసీ రైతులు కాఫీ గింజలను దళారీలకు విక్రయించి మోసపోరాదని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు అన్నారు. మండలంలోని పెద్దూరు, కొమ్మంగి గ్రామాల్లో గురువారం జీసీసీ సిబ్బంది కాఫీ కొనుగోళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎం రైతులతో మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థ లాభాపేక్ష లేకుండగా ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. అపెక్స్ కమిటీ సిఫారసు చేసిన అంతర్జాతీయ ధరలను రైతులకు అందిస్తున్నామన్నారు. కాఫీ చెర్రీ కిలో రూ.145, పార్చిమెంట్ రూ.280, రొబస్టా కిలో రూ.70లుగా ధరలు నిర్ణయించడం జరిగిందన్నారు. గిరిజన రైతులకు రవాణా భారం లేకుండగా జీసీసీ ఉద్యోగులు గ్రామాలకు వచ్చి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్నారన్నారు. జీసీసీ కచ్చితమైన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. కాఫీ గింజలను జీసీసీకి అందించిన రెండు రోజుల వ్యవధిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయం జరుగుతుందన్నారు. ఆదివాసీ రైతులు జీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ప్రజాప్రతినిధులపై బైండోవర్ కేసులు'



ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

ముంచంగిపుట్టు, జనవరి 4 : త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్‌ఐ కె.రవీంద్ర తెలిపారు. ఇక్కడి పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం పలు పార్టీల ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమై ఎన్నికల నియమ, నిబంధనలను వివరింరు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పలువురు ప్రజాప్రతినిధులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే గతంలో కేసులలో ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయండి'



సమావేశంలో ఎంపీపీ అనుషదేవి, అధికారులు

చింతపల్లి, జనవరి 4 : మండలంలోని వివిధ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు వార్షిక ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీపీ కోరాబు అనుషాదేవి సూచించారు. గురువారం ఒక్కడ మండల స్థాయి అధికారులతో నూతన సంవత్సర వార్షిక ప్రణాళికపై ఏర్పాటైన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌ఎంఐ, గిరిజన సంక్షేమ, ఇంజనీరింగ్ శాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు, విద్య మండల పరిషత్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ప్రాధాన్య క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, తహసీల్దార్ లత్సాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

డుంబ్రిగుడ, జనవరి 4 : ఈవీఎం ద్వారా ఓటు హక్కును ఏవిధంగా వినియోగించుకోలి అనే అంశంపై తహసీల్దార్ నాగమ్మ గురువారం డుంబ్రిగుడలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటును కచ్చితంగా సమర్థులకు వేయాలని సూచించారు. అనంతరం ఈవీఎంల ద్వారా ఓటును ఎలా వేయాలో సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ముజీబ్, ఆర్‌ఐ హరికృష్ణ, వీఆర్‌వో ఝాన్సీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారాతో ముగ్గురు అరెస్టు

డుంబ్రిగుడ, జనవరి 4 : మండల కేంద్రం డుంబ్రిగుడ జంక్షన్‌లో సారాతో ముగ్గురు పట్టుబడినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపడుతుండగా, గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన వంతల భగత్‌రాం, కిల్లో భగవాన్, కిల్లో దొయ్‌మొత్తిలు సారాను తరలిస్తూ పట్టుబడినట్టు చెప్పారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఢిల్లీ అధికారి



అమ్మవారిని దర్శించుకుంటున్న మనోజ్‌కుమార్ సింగ్

పాడేరు రూరల్, జనవరి 4 : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మను కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్ సింగ్ గురువారం దర్శించుకున్నారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా పాడేరు చేరుకున్న ఆయన ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, డి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

గూడెంకొత్తవీధి, జనవరి 4 : హిందూ ధర్మ విశిష్టతపై ఆదివాసీలు చైతన్యవంతులు కావాలని విశ్వహిందూ పరిషత్ మండల ధర్మ ప్రచారక్ కొర్ర బలరామ్ అన్నారు. గురువారం గూడెంకొత్తవీధిలోని ఆజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యలో శ్రీరాముని పూజల అనంతరం తీసుకువచ్చిన అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు గణపతి, సురేశ్, పలాస సన్యాసిరావు, రీమల రాజేశ్వరిలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

వంజంగి మేఘాల పర్వతంపై శరవేగంగా పారిశుధ్య పనులు



వంజంగి మేఘాల పర్వతంపై కార్మికులు సేకరించిన వ్యర్థాలు

పాడేరురూరల్, జనవరి 4 : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల పర్వతంపై పారిశుధ్య పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. మేఘాల పర్వతంపై పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించాలని ఈ నెల రెండో తేదీ నుంచి పర్యాటకుల ప్రవేశాన్ని నిలిపివేసిన విషయం విదితమేనన్నారు. కొండపై వ్యర్థాల తొలగింపు బాధ్యతలను ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించి 25 మంది కార్మికులతో పనులను చేయిస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలన్నదే అధికారుల లక్ష్యంగా పేర్కొన్నారు.